# 17786 కన్నా తగ్గితే

# మరింత బలహీనం




**సమీక్ష** : వరుసగా రెండో వారమూ మార్కెట్ నష్టాల బాటలోనే నడిచింది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మందగిస్తుందన్న ఆందోళనలు దీనికి తోడు భారత వృద్ధికి ద్రవ్యోల్బణం అడ్డంకి అవుతుందన్న భయాలు ఇందుకు కారణమయ్యాయి. చైనా వృద్ధిలో మందగమనం; అమెరికా బలహీన వృద్ధి గణాంకాలు; గ్రీస్ రుణ సంక్షోభం తదితర కారణాలతో మార్కెట్ బలహీనంగానే ప్రారంభమైంది. ముందస్తు పన్ను గణాంకాలు మిశ్రమ ధోరణిని ప్రదర్శించడంతో పాటు రిజర్వు బ్యాంకు మరో సారి వడ్డీ రేట్లను పెంచడంతో సెంటిమెంటు దెబ్బతింది. శుక్రవారమూ లాభాల స్వీకరణ కొనసాగడంతో సెన్సెక్స్ 18000 స్థాయి దిగువగా 17871 వద్ద స్థిరపడింది.

**ఎఫ్ఐఐ, ఫండ్ల తీరు** } నికర విక్రయదార్లుగానే కొనసాగిన విదేశీ సంస్థాగత మదుపుదారులు (ఎఫ్ఐఐలు) రూ.1,476 కోట్ల నికర అమ్మకాలు చేశారు. మ్యూచువల్ ఫండ్లు రూ.113 కోట్ల నికర కొనుగోళ్లు చేశాయి.

**రంగాల వారీగా** } విద్యుత్ స్క్రిప్‌లలో కొనుగోళ్లు కనిపించాయి. ఫార్మా, ఎఫ్ఎమ్‌సీజీల్లోనూ మదుపర్లు ఆసక్తి చూపారు. ప్రభుత్వం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు సానుకూలంగా వ్యవహరించిందన్న కాగ్ నివేదిక చమురు-గ్యాస్ రంగంలో విక్రయాలకు దారితీసింది. బలహీన అంతర్జాతీయ సంకేతాలతో ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. అంతర్జాతీయ గిరాకీ తగ్గడంతో లోహ షేర్లు; విక్రయాలు పతనం కావడంతో వాహన స్క్రిప్‌లు నష్టపోయాయి. లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:2గా నమోదవడాన్ని బట్టి చూస్తే మార్కెట్లో అమ్మకాలు ఒత్తిడి కనిపిస్తోంది.

**ఈవారం అంచనా** } గత వారం సెన్సెక్స్ 18000 స్థాయి కిందకు దిగజారింది. ఇటీవలి కనిష్ఠ స్థాయి 17786 కంటే దిగువకు పతనమైతే మాత్రం ఏడాది కనిష్ఠ స్థాయి 17296కు పడిపోగలదు. కేవలం 18261 కంటే పైన స్థిరపడితేనే మార్కెట్ స్వల్పకాల ఊర్ధ్వ ముఖ ధోరణిలోకి అడుగుపెట్టగలదు.

**ప్రభావిత అంశాలు** } అంతర్జాతీయ పరిణామాల నుంచి సంకేతాలను అందిపుచ్చుకోవచ్చు. ముఖ్యంగా గ్రీస్ రుణ సంక్షోభం, యూఎస్ ఫెడరల్ రిజర్వు సమావేశాలపై దృష్టి సారించొచ్చు. ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగితే మార్కెట్‌లో బలహీనతలు తొలగవు. రుతుపవనాలపై వెలువడే రెండో దీర్ఘ శ్రేణి అంచనాలను మార్కెట్ సునిశితంగా పరిశీలించనుంది. ముడి చమురు ధరల, ఆహార ద్రవ్యోల్బణం గణాంకాల తగ్గుదలల్లో పెద్దగా మార్పు లేకపోతే మార్కెట్‌కు మద్దతు లభించవచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 17786, 17470, 17296; **తక్షణ నిరోధ స్థాయిలు:** 18021, 18261, 18380

**స్వల్పకాలంలో సెన్సెక్స్ 17786 కంటే దిగువన స్థిరపడితే, మరింత బలహీనతకు దారితీస్తుంది.**

*–సతీశ్ కంతేటి, జెన్ మనీ*